క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పామర్రు: స్థానిక 20వ వార్డు బాపూజీ పేటలోని బీసీ కాలనీలో జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు పనులను పరిశీలించి అనంతరం మాట్లాడారు. బీసీ కాలనీలో 150 మీటర్ల సీసీ రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ రహదారి ఏర్పాటుకు జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక సౌజన్యంతో నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. దీనికి సహకరించిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు తమ వార్డు సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మినుము తీత పనులు ప్రారంభం



పామర్రు: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజుల నుంచి మినుము తీత పనులు ప్రారంభించారు. కురుమద్దాలి, కనుమూరు, పామర్రు తదితర గ్రామాల్లో మినుము పంట తీత పనులు చేస్తున్నారు. మిగిలిన గ్రామాలలో మినుము పైరు లేతలు కావడం వలన కొద్దిగా ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు తెలిపారు. ఈ ఏడాది మినుము పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని పేర్కొన్నారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక 8వ వార్డు పెద్దవీధి రామాలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. తొలుత రామమందిరంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు టి.రాంబాబు, సూర్యకుమారి, వెంపల అప్పారావు, వి.వీరయ్య, ఎ.మల్లేశ్వరరావు, ఎస్.రాము, టి.సూర్యనారాయణ, ఎస్.రంగారావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



కైకలూరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. రథ సప్తమి సందర్భంగా వెలంపేట గీతామందిరం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాగిరెడ్డి నారాయణరావు, మూడేడ్ల గౌరినాయుడు, సాన శ్రీనివాసరావు, మహేష్, వీఎస్ఆర్.సత్యం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



మండవల్లి: మండవల్లి అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి సమస్ర తమలపాకుల అర్చన, పూజలు వైభవంగా నిర్వహించారు. మండవల్లి, హనుమాన్ జంక్షన్ దేవదాయ శాఖ ఈఓ కొవ్వాడ దివ్యశ్రీ, కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు. తొలుత గ్రామంలో ఆంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

మండవల్లి: మండవల్లిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, మాజీ పంచాయతీ సభ్యుడు బోయిన సత్యం, గృహసారథి సుంకర బుజ్జిమ్మ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలోనే 'కార్పొరేట్' వైద్యం

రూ.5.61 కోట్లతో విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం

మాట తప్పని, మడప తిప్పని నేతగా పేరు గాంచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పేదలకు గ్రామస్థాయిలోనే కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు సచివాలయ పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా 27 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలకు ఒక్కో క్లినిక్‌కు రూ.20.8 లక్షల చొప్పున ప్రభుత్వం రూ.5.61 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో క్లినిక్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు.



మల్లాయపాలెంలో వైద్య సేవలు అందిస్తున్న విలేజ్ క్లినిక్ (ఫైల్)



గుడివాడరూరల్: పల్లెల్లో రాత్రి సమయాల్లో సరైన వైద్య సేవలు అందక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆయా ప్రాంతాల ప్రజలు తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి అయిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సచివాలయ పరిధిలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలకు రాత్రి సమయాల్లో వైద్య సేవలు పుష్కలంగా అందనుండటంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వేగంగా క్లినిక్‌ల నిర్మాణం

గుడివాడ నియోజకవర్గంలో మూడు మండలాలైన గుడివాడకు 6, నందివాడకు 12, గుడ్లవల్లేరుకు 9 వెరసి 27 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ తీసుకున్న కాంట్రాక్టర్లు, అధికారులు భవన నిర్మాణాలను శరవేగంగా జరుపుతున్నారు. గుడివాడ మండలంలోని దొండపాడు, మల్లాయపాలెం–2 హెల్త్ క్లినిక్‌లు పూర్తయి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. కల్వపూడి అగ్రహారం, రామనపూడి హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. శేరీగొల్వేపల్లి, చౌటపల్లి హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించలేదు. అదే విధంగా నందివాడ మండలంలో 12 హెల్త్‌క్లినిక్‌లకు గాను తుమ్మలపల్లి ప్రారంభోత్సవం చేసుకుని ప్రజలకు సేవలందిస్తోంది. ఇలపర్రు, కుదరవల్లి, పుట్టగుంట, తమిరిశ, అనమనపూడి గ్రామాల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అరిపిరాల, జనార్దనపురం, నందివాడ, పెదలింగాల, పోలుకొండ, రుద్రపాక గ్రామాల్లో స్థల సేకరణ సమస్యల కారణంగా హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ గ్రామాల్లో సైతం త్వరితగతిన భవన నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో చంద్రాల, గుడ్లవల్లేరు–2 హెల్త్‌క్లినిక్‌లు ప్రజలకు సేవలందిస్తున్నాయి. డోకిపర్రు–2 హెల్త్‌క్లినిక్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. శేరీదగ్గుమిల్లి, శేరీకల్వపూడి, కౌతవరం–1, డోకిపర్రు–1 హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కూరాడ, వేమవరం, గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.



ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా బిళ్లపాడులో ఇంటికి వెళ్లి వృద్ధురాలికి వైద్య సేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)

రాజీ లేకుండా నిర్మాణ పనులు

గుడివాడ నియోజకవర్గంలో జరుగుతున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ విషయంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ కావడంతో కాంట్రాక్టర్లు సైతం సహకరించి రాజీ లేకుండా పనులు పూర్తి చేస్తున్నారు. గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరిన్ని చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉంది. జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం. ఇంకా నిర్మాణ పనులు చేపట్టని గ్రామాల్లో పనులను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నాం.

–హరనాథ్‌బాబు, పంచాయతీరాజ్ డీఈ

తీరనున్న కష్టాలు



గ్రామస్థాయిలోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో రాత్రి, సమయాల్లో వైద్యసేవల కోసం పడుతున్న కష్టాలు తీరనున్నాయి. గతంలో రాత్రి సమయాల్లో వైద్య సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. మా గ్రామం నుంచి వైద్యం కోసం 20 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం హెల్త్‌క్లినిక్‌లకు అనుసంధానంగా ఫ్యామిలీ డాక్టర్‌ను ఏర్పాటు చేయడంతో వారంలో రెండు రోజులు గ్రామంలోని ఇంటింటికీ వచ్చి వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందచేయడం వల్ల తనలాంటి వృద్ధులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆనాడు పేదలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలోనే పేదలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది.

– కోళ్లేపల్లి జయలక్ష్మి, వృద్ధురాలు, మల్లాయపాలెం

అభివృద్ధి పనుల పరిశీలన



పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థాన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శుక్రవారం పరిశీలించారు. దుంపలకోడుదిబ్బ వద్ద రూ.55 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైపు లైను పనులు, పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థానం వద్ద మహాశివరాత్రి మహోత్సవం సందర్భంగా చేపట్టిన పనులను వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తాడినాడ పీఏసీఎస్ అధ్యక్షుడు సాగి చిన్నబ్బాయి రాజు, గాదిరాజు కిట్టు, సంగాని పోతురాజు, పొనుమాడి చినచలపతి రావు, పొనుమాడి సత్తిపండు, వల్లభనేని లక్ష్మీనారాయణ, పొనుమాడి దశరథ రామయ్య, పొనుమాడి వసంతరావు, తిరుమాని సోమరాజు, మోకా నాగరాజు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

తోట్లవల్లూరు: రైతులు పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా తోట్లవల్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కొండలబాబు, అంబటి శ్రీను, వీరంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రథసప్తమి ప్రత్యేక పూజలు



పామర్రులో సూర్యదేవునికి పూజ చేస్తున్న అర్చకుడు

పామర్రు: మాఘ మాసం సప్తమిని రథ సప్తమిగా జరుపుకుంటారు. శుక్రవారం స్థానిక బుచ్చమ్మతల్లి ఆశ్రమంలోని నవగ్రహాలలోని సూర్యభగవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయంలోని స్వామికి కూడా విశేషంగా అభిషేకాలు ఆలయ అర్చకులు కె.కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: రథసప్తమి పర్వదినం సందర్భంగా భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో (మీసాల వెంకన్న) శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కైకలూరు శ్యామలాంబ ఆలయంలో మాఘమాస నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు సారికి శ్యామలాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ గుర్రం రాంబాబు దంపతులు ఉభయ పూజలు చేశారు. శనివారం అమ్మవారు శుక శ్యామలదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఈఓ తెలిపారు.



కైకలూరు మీసాల వెంకన్న స్వామి ఆలయంలో రథసప్తమి పూజలు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జమీగొల్వేపల్లి(పామర్రు): మనం–వనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జమీగొల్వేపల్లి గ్రామానికి చెందిన మృతుడు దిరిశం రాజు కుటుంబానికి శుక్రవారం రూ.5వేలు సాయం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావ మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకోవడమే ఫౌండేషన్ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. సర్పంచ్ ఆర్‌శాంతకుమారి, ఎంపీటీసీ నాగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

గుడివాడ టౌన్: పౌష్టికాహారాన్ని తీసుకుని వ్యాయామం చేయడం వలన హెచ్ఐవీని నియంత్రించవచ్చునని చైల్డ్ ఫండ్ ఇండియా మేనేజర్ కల్యాణ్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్టిగ్మా రెడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ మనిషిలోని వ్యాధి నిరోధకశక్తిని తగ్గిస్తుందన్నారు. శక్తివంతమైన ఆహారం ద్వారా దానిని నియంత్రించవచ్చన్నారు. అనంతరం హెచ్ఐవీ బాధితులకు బియ్యం, బెల్లం, రాగిపిండి, కిస్‌మిస్, కర్జూరపండు, నువ్వుండలు, వేరుశనగ పప్పు, పండ్లుతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కౌన్సిలర్ మూర్తి, టీబీ కౌన్సిలర్ ఆరోగ్యం, పీపీటీసీటీ కౌన్సిలర్ విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, చైల్డ్ ఫండ్ ఇండియా పీఓ కల్యాణ్, శ్రీనివాసరావు, ఎల్‌డబ్ల్యూఎస్ దేవి పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల కోసమే రైతుల ఆందోళన

గుడివాడ టౌన్: ఢిల్లీలో రైతులు చేపట్టిన ఆందోళనలో దేశ ప్రయోజనాలు దాగి ఉన్నాయని వామపక్ష నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఆర్డీఓ కార్యాలయం ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో రైతు నాయకులు ధర్నా చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సహజ వనరులను కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, సీపీఐ నాయకులు గూడపాటి ప్రకాష్‌బాబు, రైతు నాయకులు చల్లగుల్ల సుబ్రహ్మణ్యం, గుత్తా చంటి, సీహెచ్ సత్యనారాయణ, కె. లక్ష్మణరావు పాల్గొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి: సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి కలిదిండి సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్లో రాస్తారోకో చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళి రావు, ప్రజాసంఘాల నాయకులు వి.భాస్కరరావు, పి.జ్ఞానేష, కే.రమాదేవి పాల్గొన్నారు.

రైతు కార్మిక సమస్యలు పరిష్కరించాలి

పామర్రు: దేశ వ్యాప్తంగా రైతు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశంలోని 545 సంఘాల ఇచ్చిన పిలుపులో భాగంగా పామర్రు నాలుగురోడ్లకూడలి వద్ద ధర్నాను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర ప్రసాద్, సభ్యులు ఎం.విల్సన్, కె.నాగభూషణం, ఐ.రాజు, కె.లక్ష్మణ, ఆదిశేషు, రామస్వామి, నాగ సావిత్రి, కె ఉమారాణి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



సూచనలిస్తున్న పామర్రు సీఐ, కూచిపూడి ఎస్ఐ

కూచిపూడి(మొవ్వ): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్ఐ టి శ్రీనివాస్ సూచించారు. మొవ్వ మండలం కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల వాడకం అధికమైన నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు తమ వ్యక్తి గత వివరాలను, డేటాను ఇతరులకు షేర్ చేయకూడదన్నారు. అలాగే సైబర్ నేరాలకు ఎవరైనా గురైతే 24 గంటల్లో 1930కు సమాచారం ఇస్తే నష్టపోయిన నగదు తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు

కలిదిండి: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దినతేజ్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో మంచి నీటి చెరువులను త్వరగా నింపుకోవాలని సూచించారు. మండలవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో రక్షిత తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లను మండల పరిషత్ నిధులతో నిర్మించామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు కనక దుర్గారాణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయాలతో సుపరిపాలనకు నాంది

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



తోట్లవల్లూరులో గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు నాంది పలికారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. తోట్లవల్లూరులో రూ.43.60 లక్షలతో నిర్మించిన తోట్లవల్లూరు–1 గ్రామ సచివాలయ నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసిన ఘనత ఆయనదేనన్నారు. అవ్వా, తాతలకు రూ.3 వేల పెన్షన్‌ను వేకువజామునే అందించటం అభినందనీయమన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి ఇంత మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికలలో ఆశీర్వదించి, అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

బూటకపు మాటలు నమ్మొద్దు

అబద్ధపు హామీలు, బూటకపు మాటలతో కొంత మంది తనపై విష ప్రచారం చేస్తున్నారని, దానిని నమ్మొద్దని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పల్లెబాట, పల్లెనిద్ర పేరుతో గ్రామాల్లో డ్రామాలు మొదలు పెట్టారని, వారి మాయలో పడొద్దని కోరారు. వర్ల రామయ్య గురించి రాష్ట్రమంతా తెలుసని, టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన జీతం తీసుకుంటే, గుడివాడ నుంచి ఆయన తనయుడు జీతం తీసుకుని పనిచేయటం అందరికీ తెలిసిందేనని అనిల్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు వీరలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు శివారెడ్డి, వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

యువశక్తిపై ఆధారపడి ఉన్న దేశ భవిష్యత్తు



కాలేజీ పుస్తకావిష్కరణలో సతీష్‌రెడ్డి

గుడ్లవల్లేరు: దేశ భవిష్యత్తు యువశక్తిపై ఆధారపడి ఉందని ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. గుడ్లవల్లేరు శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవ వేడుకలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పర్యావరణానికి హాని కలగకుండా రక్షణ సాంకేతికతపై భారత ప్రభుత్వం తీసుకొస్తున్న వివిధ అంశాలను వివరించారు. తొలుత కాలేజీ వ్యవస్థాపకుడు వల్లూరుపల్లి వెంకట రామశేషాద్రిరావు చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. 25ఏళ్ల ఇంజినీరింగ్ కాలేజీ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అష్టావధాన కార్యక్రమంలో త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ పాల్గొన్నారు. టెక్ ఫెస్ట్ పేరిట వివిధ కంపెనీలచే గుర్తింపు పొందిన నూతన ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పద్మశ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరి, కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఫార్మసీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్లు ముసునూరి శ్రీనివాసరావు, కె.వి.కృష్ణారావు, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ఎంపిక



కానుకొల్లులో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు

మండవల్లి: కానుకొల్లులో 150 మంది అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్ల స్థలాలు గతంలో మంజూరు చేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పుట్టి సత్యనారాయణ శుక్రవారం పేర్కొన్నారు. పార్టీలు, కుల, మతాలకతీతంగా అర్హులను ఎంపిక చేసి స్థలాలు కేటాయించినట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు అవకతవకలు జరిగాయని గురువారం ఆందోళన చేయడం అర్థరహితమని నాయకులు పేర్కొన్నారు. 47 మందికి స్థలాలు మంజూరులో అవకతవకలు జరిగాయని టీడీపీ నాయకులు ఆరోపించడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కుందేటి నాగేశ్వరరావు, విష్ణుమూర్తుల శ్రీను, శౌంతి కుమార స్వామి, దర్శిగుంట్ల స్వామి పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడ్లవల్లేరు: పేదల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద గుడ్లవల్లేరు గ్రామ సచివాలయం–1 పరిధిలో స్థానికులకు కంటి పరీక్షలను నిర్వహించారు. సాధారణ వైద్యాన్ని వైద్యులు అందించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, గ్రామ కార్యదర్శులు ఎ.జె.ఎల్.నరసింహారావు, సీహెచ్.ఉమామహేశ్వరరావు, ఎస్.రమేష్, ఎం.గోవర్ధనరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

భట్లపెనుమర్రు(మొవ్వ): పేదలకు మెరుగైన వైద్యం అందేలా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో శుక్రవారం జరిగిన ఆరోగ్య సురక్ష–2వ ఫేజ్ శిబిరాన్ని ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ సర్పంచ్ మట్టా ఇందిర, ఉపసర్పంచ్ చలసాని వెంకటరత్నంతో కలసి ప్రారంభించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్లు సీహెచ్ రాజేశ్వరి, ఉమామహేష్, కామినేని హాస్పటల్ డాక్టర్ బి.శేషు వైద్య పరీక్షలు చేశారు. నాయకులు కొండేటి చందు, మట్టా సతీష్ సహకరించారు.

సమష్టి కృషితోనే గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న హనుమాన్ చౌదరి

గుడ్లవల్లేరు: గ్రామస్తుల సమష్టి కృషితోనే అంగలూరు అభివృద్ధి జరుగుతుందని ఏపీ ఐటీ పూర్వ సలహాదారు పద్మశ్రీ త్రిపురనేని హనుమాన్ చౌదరి అన్నారు. గ్రామంలోని ఎస్సీవాడలో రూ.6 లక్షలతో రామాలయ ప్రహరీతో పాటు రూ.4 లక్షలతో గ్రామ సచివాలయంలో వేదిక నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుట్టిన దేశం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అంగలూరు నుంచి ప్రతిఒక్క విద్యార్థి అన్ని రంగాల్లో నిష్ణాతులై నిలవాలన్నారు. నలంద యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ డాక్టర్ సునైన మాట్లాడుతూ మహిళలు వారి లక్ష్యం కోసం ధైర్యంగా అడుగులు వేయాలన్నారు. అనంతరం అతిథులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com